విత్తనంపై అవగాహన


పత్తి విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

- లైసెన్స్‌డ్ విత్తనాలనే కొనుగోలు చేయాలి
- ఆఫర్లతో రైతులకు ఎర వేస్తున్న కంపెనీలు
- నకిలీ విత్తనాలతో జాగ్రత్త
- వ్యవసాయాధికారుల అవగాహన

కౌటాల: ఖరీఫ్ కాలం పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్న తరుణంలో పత్తి విత్తనాల కొనుగోలుపై గ్రామాల్లో అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని రైతులు విత్తనాలు వేయడానికి చేనులను దున్ని సిద్ధం చేస్తున్నారు. పలు రకాల కంపెనీలు విత్తనాలు, పురుగు మందుల ప్రచారాన్ని ఉధృతం చేశాయి. విత్తుకొద్ది పంట అన్న నానుడి దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన విత్తనాల కోసం రైతులు ఆరా తీస్తున్నారు. ఎరువులైనా, విత్తనాలైనా రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

డీలర్లకు ఆఫర్లు..

పలు విత్తన కంపెనీల యాజమన్యాలు జిల్లాలోని డీలర్లకు రకరకాల ప్యాకేజీలు, విదేశీ టూర్లు, ఆఫర్ చేయడంతో వారు రైతులకు ఎక్కువ మోతాదులో సదురు కంపెనీల విత్తనాలను కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రైతులు ఆయా కంపెనీల వలలో పడి నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి నష్టపోవడం ఏటా జరుగుతుంది. జిల్లాలో మొత్తం 1,19,165 మంది రైతులు ఉన్నారు. జిల్లాలో 4,49,131 ఎకరాల సాగు భూమి ఉంది. జిల్లాలో పత్తి, వరి, కంది, సోయా, మిర్చి పంటలను అధికంగా సాగు చేయనున్నారు.

చలామణిలో నకిలీ విత్తనాలు

జిల్లా రైతాంగం ఖరీఫ్‌లో అత్యధికంగా పత్తి, సోయాబిన్, వరి పంటలను సాగు చేస్తారు. పత్తి విత్తనాలకు సంబంధించిన పలు రకాల కంపెనీలు ఆయా గ్రామాల్లో రైతులకు అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తున్నాయి. దళారులు రైతులకు ప్రభుత్వ నిషేధిత పత్తి విత్తనాలు గుట్టుచప్పుడు కాకుండా అమ్ముతున్నట్లు సమాచారం. కొందరు ప్రైవేట్ వ్యాపారులు గ్రామాల్లో తిరుగుతూ పత్తి విత్తనాలను కిలోల కొద్దీ లూజ్‌గా అమ్ముతున్నారనే ఆరోపణలున్నాయి. రైతులు తొందరపడి లూజ్ విత్తనాలు కొనుగోలు చేస్తే నాణ్యత లోపంతో విత్తిన విత్తనం మొలకెత్తకపోవడం.. మొలకెత్తినా పంట దిగుబడి తగ్గిపోవడం వంటివి జరుగుతాయని అధికారులు హెచ్చరిస్తున్నారు. రైతులు అప్రమత్తంగా ఉంచాలని సూచించారు.

నిషేధిత విత్తనాలు వద్దు..

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో అధికారులు రైతులకు పత్తి విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పిస్తున్నారు. రైతులు అధిక దిగుబడులపై ఆశతో విత్తనాలతో పాటు ఎరువులు మోతాదుకు మించి వినియోగించొద్దంటున్నారు. లైసెన్స్ ఉన్న ఫర్టిలైజర్ షాపుల్లోనే రైతులు పత్తి విత్తనాలు కొనుగోలు చేయాలని, విత్తనాలు కొన్న షాప్ నుంచి కచ్చితంగా రశీదు తీసుకోవాలంటున్నారు. గడువు తీరిన, లూజ్ విత్తనాలు కొనుగోలు చేయవద్దని పేర్కొన్నారు. గ్లైసిల్ విత్తనాలను రైతులు ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయవద్దని సూచిస్తున్నారు. నకిలీ విత్తనాలు అమ్మినా, కొనుగోలు చేసినా అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారని అవగాహన కల్పిస్తున్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే వెంటనే మండల వ్యవసాయాధికారి రాజేశ్ సెల్: 9032819454, కౌటాల ఎస్సై మధుకర్ సెల్: 9440900668 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

– ఎస్. మధుకర్, ఎస్సై

రైతులు అప్రమత్తంగా ఉండాలి



లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే రైతులు విత్తనాలు కొనుగోలు చేయా లి. వారి వద్ద నుంచి రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి. రైతులకు పంట బీమా రావాలంటే రశీదు తప్పనిసరి. ఫర్టిలైజర్ షాపుల్లో డీలర్లు ఎరువులు, విత్తనాల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలి.

– పాలకుర్తి రాజేశ్, ఏవో

పార్కింగ్ పరేషాన్

- సైడ్ డ్రెయిన్‌ల ఆక్రమణ
- తరుచూ తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్య
- ఈ–చలాన్లతో వాహనదారుల జేబులు గుల్ల


రోడ్డుపై నిలిపిన వాహనాలు

వాంకిడి: మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం గ్రామాల నుంచి నిత్యం వేలాదిమంది ప్రజలు వస్తుంటారు. గురు, సోమవారాల్లో మండల కేంద్రంలోని వ్యాపార సముదాయాలు, రోడ్లు జనాలతో కిక్కిరిసిపోతాయి. ఫర్టిలైజర్లు, కిరాణా దుకాణాలు, మెకానిక్ షాపులు, ఎలక్ట్రానిక్ దుకాణాలు, బేకరీలు, టీ స్టాల్‌లు ఇలా ప్రజలకు అవసరమైన దుకాణాలన్ని రోడ్డు వెంబడే ఉన్నాయి. దీంతో వివిధ అవసరాల నిమిత్తం వచ్చే ప్రజలు తమ వాహనాలను రోడ్లపైనే నిలుపుతున్నారు. ప్రత్యేకించి స్థలం లేకపోవడంతో దుకాణాల ముందు రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో తరుచూ ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది.

స్థలం లేక ఇబ్బందులు..

మండల కేంద్రంలోని ప్రధాన మార్కెట్ ఏరియాలో వాహనాలు పార్కింగ్ చేసేందుకు ప్రత్యేకించి స్థలం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండల కేంద్రం గుండా నాలుగు వరుసల జాతీయ రహదారి –363 నిర్మాణం జరుగుతుండడంతో వాహనాల పార్కింగ్ పెద్ద సమస్యగా మారింది. రహదారి నిర్మించేందుకు స్థల సేకరణ సమయంలో రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని మాత్రమే సేకరించారు. దీంతో ప్రస్తుతం వాహనాలు నిలిపేందుకు స్థలం లేకుండాపోయింది. సర్వీస్ రోడ్డు గుండా సైడ్ డ్రెయిన్‌ను ఆనుకునే వివిధ రకాల దుకాణాలు ఉండటంతో అవసరాల నిమిత్తం సరుకులు, వస్తువులు కొనుగోలు చేసుకునే జనాలు వాహనాలను రోడ్డుపైనే నిలపాల్సి వస్తుంది. కొందరు దుకాణ యజమానులు చిరు వ్యాపారులకు దుకాణాల ముందున్న సైడ్ డ్రెయిన్‌లపై స్థలాలను అద్దెకు ఇస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. కూరగాయలు, ఇతర వస్తువులు అమ్ముకునే వారికి ప్రత్యేకంగా స్థలం కేటాయించడంలో పంచాయతీ అధికారులు విఫలమవుతుండగా చిరువ్యాపారులు నాలాలపై కూర్చొని అద్దె చెల్లిస్తూ వ్యాపారం చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య కూడా పెరుగుతుంది. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వాహనదారుల జేబులు గుల్ల..

మండల కేంద్రానికి వచ్చే వారు వాహనాలను రోడ్డుపైనే నిలుపుతుండడంతో తరుచూ ఈ –చలాన్ల రూపంలో నష్టపోతున్నారు. కొన్ని నెలల క్రితం పోలీసులలో ఒకరు లేదా ఇద్దరు కానిస్టేబుళ్లు మార్కెట్ ఏరియాలో ఉంటూ వాహనాలు రోడ్డుపై నిలుపకుండా, ట్రాఫిక్ జామ్ కాకుండా చూసుకునే వారు. కానీ కొన్ని నెలలుగా ఈ –చలాన్లు వేస్తున్నారు. దీంతో మార్కెట్ రద్దీగా ఉండే సమయాల్లో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని సందర్భాల్లో సర్వీస్ రోడ్డు గుండా బస్సులు, లారీలు వంటి పెద్ద వాహనాలు వస్తే అండర్ పాస్ వద్ద వాహనాలు ఎటూ కదలలేని పరిస్థితి నెలకొంటుంది. సరుకులు కొనేందుకు మండల కేంద్రానికి వచ్చిన వాహనదారులకు తిరిగి ఇంటికి వెళ్లే లోపే ఈ –చలాన్ల రూపంలో జరిమానాలు పడుతుండటం గమనార్హం. రహదారి గుండా, దుకాణ సముదాయాల ముందు నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేస్తే కొంత వరకైనా సమస్య అదుపులోకి వస్తుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

వాహనదారులు సహకరించాలి



మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. వాహనదారులు, దుకాణదారులు రోడ్డుపై వాహనాలు నిలపకుండా సహకరించాలి. రోడ్డు భద్రత నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నిలిపితే చర్యలు తీసుకుంటాం.

– డి.సాగర్, ఎస్సై, వాంకిడి

క్లుప్తంగా

ఉపాధి పనులకు కొలతలు


కొలతలు పరిశీలిస్తున్న ఈసీ ఐక్యానాయక్

కెరమెరి: మండల కేంద్రంలో కెరమెరి శివారులో ఉపాధిహామి పథకంలో నిర్మించిన సైడ్ డ్రెయినేజీ పనులకు సోమవారం ఈజీఎస్ ఈసీ ఐక్యా నాయక్ కొలతలు తీసుకున్నారు. సుమారు 900 మీటర్ల పొడవుల గల సైడ్‌డ్రెయిన్‌కు రూ.1,13,695 వెచ్చించారు. ఎంబీ రికార్డుకు, క్షేత్రస్థాయిలో ఉన్న పనుల్లో ఏవైనా తేడాలున్నాయా అని పరిశీలించారు. ఎంత పని జరిగితే అంతే రికార్డు చేయాలని సూచించారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్‌లు మహేందర్, అరవింద్ ఉన్నారు.

రికార్డులు నమోదు చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో అంజద్‌పాషా

కెరమెరి: సరైన విధంగా రికార్డులు నమోదు చేయాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈజీఎస్ ఏపీవో మల్లయ్యతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో వర్క్‌సైట్‌లో పనులను సరైన విధంగా ఉండేలా చూడాలన్నారు. జాబ్‌కార్డుల అప్‌డేషన్ తప్పనిసరిగా చేయాలని సూచించారు. ఈ నెల 10న గ్రామ పంచాయతీలను సందర్శించేందుకు జిల్లాకు కేంద్ర బృందం వస్తుందని ఆలోపు పనులు సక్రమంగా పూర్తి చేయాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.

యూనిఫామ్‌లు పరిశీలన


కుట్టు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సారయ్య

కెరమెరి: మండలంలోని సాంగ్వి గ్రామంలో సోమవారం కుట్టుమిషిన్ కేంద్రాన్ని ఐకేపీ డీపీఎం సారయ్య పరిశీలించారు. దుస్తులు కుట్టే విధానాన్ని ఆయన పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని యూనిఫామ్‌లు కుట్టారు.. ఇంకెన్ని మిగిలి ఉన్నాయనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 6 తేదీలోపు కుట్టడం పూర్తి చేయాలన్నారు. అనంతరం రాంనగర్, కొలాంగూడ గ్రామాలను ఆయన సందర్శించారు. ఆయన వెంట సీసీలు శ్యాంరావు, ధన్‌రాజ్, కౌసల్య తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం


ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

తిర్యాణి: మండలంలోని దుర్గాపూర్ గ్రామ శివారులో వ్యవసాయ సంబంధిత పనుల నిమిత్తం ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు ఏఈ కవిత తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం ట్రాన్స్‌ఫార్మర్‌ను మే 31న కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని కాపర్‌వైర్‌ను దొంగిలించినట్లు తెలిపారు. దొంగిలించిన వైర్ విలువ సుమారు రూ.8వేలు ఉంటుందన్నారు. ఈ ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

మహారాష్ట్ర రైతులకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు

తాంసి: మహారాష్ట్రకు చెందిన రైతులకు విత్తనాలు విక్రయించి, విత్తనాల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ లక్ష్మీ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని విత్తన దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తన విక్రయాలను పరిశీలించి, రైతులకు అందజేయాలని సూచించారు. స్టాక్ వివరాలు, రికార్డులను పరిశీలించారు. అధిక ధరలకు పత్తి విత్తనాలు విక్రయించవద్దని సూచించారు. వారి వెంట ఏఈవోలు శివప్రసాద్, సుప్రియ, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, తదితరులు ఉన్నారు.

విద్యార్థినికి సన్మానం

కోటపల్లి: మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన కొత్తూరి మహేశ్ –స్వరూప దంపతుల కూతురు ప్రవంతి చిన్నవయసులోనే తండ్రిని కోల్పోయింది. అయినా 2022–23సంవత్సరం ఇంటర్మీడియట్ టీఎస్‌డబ్ల్యూ సిర్పూర్ కళాశాలలో హెచ్ఈసీ గ్రూప్ చదివి కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోనే మొదటి ర్యాంక్ సాధించింది. అందుకు గాను సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి, అధ్యాపక బృందం ప్రవంతిని, తల్లి స్వరూపను శాలువాతో ఘనంగా సన్మానించి రూ.25వేల చెక్కును అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి)లో ఈదురుగాలులు


రోడ్డుపై పడిపోయిన చెట్టును తొలగిస్తున్న ఎస్సై

సిర్పూర్(టి): మండలంలో సోమవారం ఉదయం విపరీతంగా ఈదురుగాలులు వీయడంతో చెట్లు, చెట్ల కొమ్మలు విరిగి రోడ్లపై పడిపోయాయి. దీంతో ప్రయాణికులు, మండలవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సిర్పూర్(టి) –కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై మండలంలోని పెద్దబండ గ్రామ సమీపంలో చెట్టు విరిగి ప్రధాన రహదారిపై పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రధాన రహదారిలో రాకపోకలు గంటల తరబడి నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ట్రాఫిక్‌కు అంతరాయం వాటిల్లడంతో ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో పోలీసులు రోడ్డుపై చెట్టును జేసీబీ సహాయంతో తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

చల్లబడ్డ వాతావరణం

చింతలమానెపల్లి: నైరుతి రుతుపవనాల రాకతో వాతావరణం చల్లబడింది. ఆదివారం వరకు 45డిగ్రీలకు పైగా నమోదైన ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయాయి. ఆదివారం రాత్రి గాలులతో పాటు మబ్బులు కమ్ముకున్నాయి. తొలకరి జల్లులు కురిశాయి. మండలంలో సోమవారం గరిష్ఠంగా 34డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా కనిష్ఠంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రుతుపవనాల రాకతో వర్షాలు ముందుగానే రానున్నాయనే వాతావరణ శాఖ సమాచారంతో రైతులు పనులు ప్రారంభించారు.

శివాజీ అడుగుజాడల్లో నడవాలి


శివాజీ విగ్రహావిష్కరణ చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: శివాజీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని ఇటిక్యాల గ్రామంలో ఛత్రపతి శివాజీ నూతన విగ్రహాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ హిందూ ధర్మం పరిరక్షణకు పాటుపడిన వీరుడు ఛత్రపతి శివాజీ అన్నారు. ప్రతీ గ్రామంలో శివాజీ విగ్రహం ఉండాలన్నారు. ఆరె కులస్తుల హక్కుల కోసం కలిసికట్టుగా కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగేశ్వర్ రావు, ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాం, మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గౌడ్, మల్లన్న, బీసీ సంక్షేమ సంఘం నాయకులు రమేశ్, ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు దాదరాం, జిల్లా ప్రధాన కార్యదర్శులు భిక్కాజీ, తిరుపతి, మండల అధ్యక్షుడు సంతోష్, గ్రామస్తులు అన్నారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి


విద్యార్థులతో సభ్యులు

కౌటాల: గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువులో రాణించాలని రూం టూ రీడ్ బ్లాక్ ప్రోగాం కోఆర్డినేటర్ వేల్పుల సంపతి అన్నారు. సోమవారం మండలంలోని ముత్తంపేట గ్రామంలో స్థానిక విద్యార్థులకు రూమ్ టూ రీడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు సమ్మర్ క్యాంప్‌లో భాగంగా అక్షరాన్ని గుర్తుపట్టడం, అక్షర ధ్వని, చదవడం, రాయడం నేర్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు సెలవుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సెల్‌ఫోన్ వినియోగంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత పనులు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలోని 17వ వార్డు బృందావన కాలనీ, సీతారామ కాలనీ, నాగదేవత కాలనీ, చున్నంబట్టి వాడల్లో వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని, ముందస్తు చర్యల్లో భాగంగా మత్తడి కాలువ, డ్రెయినేజీల్లోని పూడికను తీసే పనులను మున్సిపల్ అధికారులు సోమవారం ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, మున్సిపల్ డివిజనల్ ఇంజనీర్ మధుకర్, వార్డు కౌన్సిలర్ పూదరి సునిత, ఏఈ రాజేందర్‌లు పనులను పరిశీలించారు.

గిరి గ్రామాల అభివృద్ధికి కృషి


పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

పెంచికల్‌పేట్: గిరి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండలంలోని బొంబాయిగూడ వద్ద ఉచ్చమల్ల వాగు పైన నిర్మిస్తున్న లోలెవల్ వంతెన నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలో రహదారులు, వంతెనల నిర్మాణానికి ప్రాముఖ్యత ఇచ్చి గిరి గ్రామాల్లో రవాణా సౌకర్యం మెరుగుపరచడానికి కృషి చేస్తానన్నారు. పనుల్లో నాణ్యత పాటించి సకాలంలో పూర్తయ్యేలా చూడాలని గుత్తేదారికి సూచించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ..

పోతెపల్లి మాజీ సర్పంచ్ దాసరి చంద్రమౌళి కుమారుడు జీవన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు.

‘ఉపాధిహామీ’తో ఊరట

- సద్వినియోగం చేసుకుంటున్న గ్రామీణులు


జైనూర్‌లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

జైనూర్: గ్రామాల్లోని కూలీలు పట్టణాలకు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వాలు ఉపాధిహామీ పథకాన్ని అమలు చేస్తున్నారు. దీంతో ఎండాకాలంలో వ్యవసాయ పనులు ముగిసిన తర్వాత కూలీలు ఉపాధిహామీ పనులకు వెళ్లి సద్వినియోగం చేసుకుంటున్నారు. చిన్న, సన్నకారు రైతు వ్యవసాయ క్షేత్రాల్లో వరద నీటిని బయటకు పంపించేందుకు మళ్లింపు కాలువలు, నీటిని నిల్వ చేసుకునేందుకు ఫారంపాండ్‌ల నిర్మాణం, బీడు భూములలో చిన్ననీటి కుంటల నిర్మాణం, గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం వంటి ఎన్నో పనులను ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపడుతున్నారు.

మండలం వివరాలు..

మండలంలో 6530 జాబ్‌కార్డులు ఉండగా, 12,552 మంది కూలీలు ఉపాధిహామీ పథకంలో పనులు చేస్తున్నారు. ఇందులో 303 జాబ్‌కార్డు కలిగిన కుటుంబాలు 70 రోజులకు పైగా పని దినాలు పూర్తి చేశాయి.

కానరాని నీటి జాడ


నిరుగుడి చెరువులో తేలిన బండరాళ్లు

నిత్యం గలగల నీరు పారే జీవనదులు నీరు లేక జీవం కోల్పోయాయి. ఎండలు దంచి కొడుతుండడంతో కెరమెరి మండలంలోని చెరువులు, వాగుల్లో నీరు పూర్తిగా ఇంకిపోయింది. భూగర్భజలాలు సైతం అడుగంటిపోయాయి. దీంతో అడవికి మేత కోసం వెళ్లిన పశువులకు దప్పిక తిప్పలు తప్పడం లేదు. వాగులు, వంకల్లో నీరు ఇంకిపోవడంతో చేతిపంపులు, కుళాయిల వద్ద నీటి బొట్టు కోసం వెతుకులాడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కాగా చుక్క నీరు లేకపోవడంతో వాగుల్లో నీటికి బదులు బండ రాళ్లు, పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి.

– కెరమెరి


హట్టివాగులో కానరాని నీరు


జన్కాపూర్‌లో నీటి కోసం ఇంటిబాట పట్టిన పశువులు


అనార్‌పల్లి వాగులో నీరు లేక కన్పిస్తున్న పిచ్చి మొక్కలు

రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు

కైలాస్‌నగర్: రైతులు విత్తనాల విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని పలు విత్తన దుకాణాలను సందర్శించారు. రైతులకు విత్తనాలు అందుతున్న తీరును పరిశీలించారు. దుకాణాల్లోని పత్తి విత్తన ప్యాకెట్ల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. రైతులు కోరుతున్న రాశీ 659 విత్తనాలతో పాటు ఇతర బ్రాండెడ్ విత్తనాలు సైతం డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

తలమడుగు: పత్తి విత్తనాలు కొరత సాకుతో అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ రాజమోహన్, ఏవో మహేందర్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని సుంకిడి గ్రామంలో రైతులకు పత్తి విత్తనాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరమైన పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. నిబంధనలు పాటించని డీలర్ల లైసెన్స్‌లు రద్దు చేయడం జరుగుతుందన్నారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రశీదు తీసుకోవాలన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ : తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.సాయికుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899